# దీపావళి సందడి




నగరంలో దీపావళి సందడి నెలకొంది. పండుగ పూజ సామగ్రి కొనుగోలుదారులతో మార్కెట్ కళకళలాడింది. రెండు రోజులుగా వర్షం పడుతుండడంతో టపాసుల విక్రయదారులు భయపడ్డారు. అయితే ఆదివారం తెరపి ఇవ్వడంతో వ్యాపారాలు ఊపందుకున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు




## క్లుప్తంగా

### ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

గుంటూరు రూరల్: దీపావళి పండుగ నియోజకవర్గంలోని ప్రతి కుటుంబంలో వెలుగులు నింపాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని దేవుని కృప ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు.

### పేకాట స్థావరంపై దాడి

గుంటూరు రూరల్: పేకాట స్థావరంపై దాడి చేసి జూదరులను అదుపులోకి తీసుకున ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాలు.. పెద్దపలకలూరులో పేకాటాడుతున్నట్లు సమాచారం మేరకు దాడి చేసి ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వీరి నుంచి రూ.26 వేలు, 6 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

### వృద్ధులను ఆదుకునేందుకు ముందుకు రావాలి



నగరంపాలెం: వయో వృద్ధులను, దివ్యాంగులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని గిరిధారి మిత్రమండలి అధ్యక్షులు బవిరిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. కొత్తపేట సోమువారివీధిలోని సమితి కార్యాలయంలో ప్రతి నెల ఆదివారంలో భాగంగా వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ సమితి పక్షాన తమవంతుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అదే విధంగా వారికి చేయూత అందించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి పలకలూరు శివరావు, కోశాధికారి దిండు రాజశేఖర్, సభ్యులు జుజ్జూరు శివకుమార్, పబ్బిశెట్టి సంజీవరావు, గార్లపాటి రోశయ్య, పీఎస్ఆర్ గుప్తా, సింగంశెట్టి ఆంజనేయులు పాల్గొన్నారు.

### నేడు డయల్ యువర్ కమిషనర్ రద్దు

నెహ్రూనగర్: దీపావళి పండుగ సందర్భంగా సోమవారం నిర్వహించాల్సిన డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్ కార్యక్రమాలను రద్దు చేసినట్లు కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించాలని కోరారు.

### 26న హనుమంతరావు గ్రంథావిష్కరణ సభ



నగరంపాలెం: ప్రజా వైద్యుడు ముద్దన హనుమంతరావు జీవితంపై తీసుకొచ్చిన 'ప్రజల వైద్యుడు డాక్టర్ ముద్దన హనుమంతరావు' గ్రంథావిష్కరణ సభ ఈనెల 26వ తేదీ నిర్వహించనున్నట్లు భారతి ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షులు బొల్లెపల్లి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థాన ఆవరణలో ఆదివారం ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ డాక్టర్ వెన్నిశెట్టి సింగారావు రచించినట్లు చెప్పారు. సభకు రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ యలమంచిలి శివాజీ, దేవస్థానం అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, మాజీ ఎంపీ కరణం బలరామకృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశంలో దేవస్థానం అధ్యక్షుడు సిహెచ్ మస్తానయ్య, డాక్టర్ వెన్నిశెట్టి సింగారావు, ఏలూరి సూర్యనారాయణ, ఇరుగులపాటి వేణుగోపాలరావు పాల్గొన్నారు.

### ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



గుంటూరు మెడికల్: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ తపనిసరిగా శ్రద్ధ అవసరమని ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్స్ చైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. ఆదివారం స్థానిక నాజ్‌సెంటర్‌లోని ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్స్‌లో స్వింగ్స్ అండ్ వింగ్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డేగల ప్రభాకర్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ, సరైన సమయంలో వైద్యుల సూచనలు పాటించకపోవడంతో ప్రాణాలు పోతున్నాయని చెప్పారు. చిన్న సమస్యగా ఉన్నప్పుడే తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు, వైద్యుల సూచనలు పాటించాలని సూచించారు. డేగల ప్రభాకర్‌ను అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో యడ్లగొండ నాగేశ్వరరావు, మేకల బాబూరావు, నరసింహారావు, దివాకరాలు సుబ్రహ్మణ్యం, రాగం సదాశివరావు, శ్రీనివాస్, రమణ పాల్గొన్నారు.

## ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

పెదకాకాని: పేద బడుగు బలహీన వర్గాలకు మెడికల్ విద్యను దూరం చేసేందుకే కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తుందని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆరోపించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి మండల పార్టీ అధ్యక్షుడు ముడియాల మల్లికార్జునరెడ్డి అధ్యక్షత వహించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ ఆ మెడికల్ కళాశాలలను పేదవారికి దూరం చేస్తూ ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసేందుకు టెండర్లు పిలవడం దారుణమన్నారు. ప్రభుత్వంలో ఉన్న పెద్దల పేర్లతో టెండర్లలో దక్కించుకోవడం వారిని బినామీగా ఉంచి సొమ్ము చేసుకోవాని పెదబాబు, చినబాబు పెద్ద పథకం వేశారని ఆరోపించారు. కేవలం మెడికల్ సీట్లు వ్యాపారం కోసం మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తున్నాడన్నారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలల్ని ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. సమావేశం అనంతరం స్థానిక నాయకులతో కలసి అంబటి మురళీకృష్ణ సంతకాల సేకరణ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, ఎంపీటీసీ సభ్యురాలు షేక్ షహనాజ్, నాయకులు తాడిబోయిన వేణుగోపాల్, గోళ్ల శ్యాంముఖర్జీ బాబు, దంతాల శ్రీను పాల్గొన్నారు. అలానే ఉప్పలపాడు, తక్కెళ్లపాడు గ్రామాల్లో కూడా స్థానిక నాయకులు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.



పెదకాకానిలో సంతకాల సేకరిస్తున్న అంబటి మురళీకృష్ణ

**ఆలూరు, పెదపాలెంలో..**

పొన్నూరు: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు చేపట్టిన ప్రజా ఉద్యమంలో భాగంగా పొన్నూరులో కోటి సంతకాల సేకరణ కొనసాగుతోంది. పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆదేశాల మేరకు ఆదివారం ఆలూరు, పెదపాలెం గ్రామాల్లో నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చింతలపూడి మురళీకృష్ణ, మైనార్టీ విభాగం అధ్యక్షులు షేక్ మౌలాలి, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షులు రుద్రపాటి నాగేశ్వరరావు, ఎస్సీ సెల్ అధ్యక్షులు పొనుగుపాటి పాల్ రాజు, రైతు విభాగం అధ్యక్షులు నూతలపాటి శివరామకృష్ణ, నాయకులు కంచర్ల కరుణబాబు, రుద్రపాటి నరేంద్ర, భాగ్యరాజు పాల్గొన్నారు.

## ఆయుర్వేదంతో ఆరోగ్యానికి మేలు



లక్ష్మీపురం: ఆయుర్వేదంలో శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రధానంగా చికిత్స జరుగుతుందని చెన్నై ఆయుర్వేద వైద్య కళాశాల విశ్రాంత అసిస్టెంట్ ప్రొఫెసర్ శివ కళ్యాణ్ పేర్కొన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆరోగ్య సభ ఆదివారం నిర్వహించారు. సభకు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ ఆయుర్వేదంలో వ్యాధుల చికిత్స, ఆరోగ్య నిర్వహణ, ప్రకృతితో మమేకమవ్వటం వంటి అంశాలు ఉంటాయన్నారు. పట్టణీకరణ, మారుతున్న జీవనశైలి కారణంగా వచ్చే దీర్ఘకాలిక రుగ్మతలను పరిష్కరించడంలో ఆయుర్వేదం ముఖ్యపాత్ర పోషిస్తుందని వివరించారు. నడక తగ్గి, తినటం పెరిగిన తరువాతనే వ్యాధులు పెరిగాయని, ఆకలి, దాహం వేసినప్పుడు మాత్రమే ఆహారం, నీరు తీసుకోవాలని, మూడు పూటలా ఆహారం సరికాదని అన్నారు. సూర్యాస్తమయం అయిన తరువాత ఒకటి, రెండు గంటల లోపు మాత్రమే ఆహారం తీసుకోవాలని, రాత్రి భోజనం అనంతరం రెండు గంటలు మేలుకొని తరువాత పడుకోవాలని, వండిన ఆహారం ఒకటిన్నర గంట లోపే తినాలని అన్నారు. సభలో ప్రముఖ యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్, జన విజ్ఞాన వేదిక నాయకులు ఎ.చలమారెడ్డి, జీవన సంధ్య సంస్థ నాయకులు ఆర్.వెంకటరత్నం ప్రసంగించారు.

## గ్రీన్ గ్రేస్ ఆధ్వర్యంలో 30 వేల మట్టి ప్రమిదలు పంపిణీ



మట్టి ప్రమిదలు పంపిణీ చేస్తున్న గ్రీన్ గ్రేస్ సీపీఓ అంబటి మురళీకృష్ణ

కొరిటిపాడు: పిల్లలు, పెద్దలు ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా జరుపుకునే దీపావళి పండుగ సందర్భంగా బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'గ్రీన్ గ్రేస్' ఆవరణ వద్ద పర్యావరణ హితంగా 30 వేల మట్టి ప్రమిదలను నగర ప్రజలకు ఉచితంగా అందించారు. గ్రీన్ గ్రేస్ సీపీఓ అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. సమాజంలో అనేక రుగ్మతలకు కారణమవుతున్న ప్లాస్టిక్ తదితర ఉత్పత్తులను నిషేధించాలని, తద్వారా క్యాన్సర్ రహిత సమాజాన్ని నిర్మించాలనేది బజరంగ్ ఫౌండేషన్ ఆశయమన్నారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చేపట్టే పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు మద్దతుగా నాలుగేళ్లుగా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. రాబోయే రోజుల్లో గ్రీన్ దీపావళి జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కోలాహలంగా జరిగిన పంపిణీ కార్యక్రమంలో నగర ప్రజలు భారీ సంఖ్యలో వచ్చి మట్టి ప్రమిదలు తీసుకున్నారని చెప్పారు. సమాజహిత పర్యావరణహిత కార్యక్రమాలు నిర్వహించడం, ఇటీవల వినాయకచవితి సందర్భంగా 4వేల మట్టి వినాయకులను పంపిణీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో బజరంగ్ ఫౌండేషన్ సభ్యులు, 'గ్రీన్ గ్రేస్' ప్రాజెక్ట్ డైరెక్టర్లు సిద్దినేని శ్రీనివాసరావు, ఎస్.సమీర్ నందన్, జి.సుబ్బారావు పాల్గొన్నారు.

## పొలాల్లోకి వర్షం నీరు



తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలో శనివారం రాత్రి నుంచిఆదివారం తెల్లవారుజాము వరకు పడిన భారీ వర్షంతో పలు రకాల పంటపొలాల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. ప్రస్తుతం మాగాణి, అరటి, ఇతర పంటలకు ఎటువంటి నష్టం లేకపోయినా, ఆకుకూర మడుల్లోకి భారీగా వర్షపునీరు వచ్చి చేరడంతో ఆకుకూరలు పండించే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో కుంచనపల్లి, ప్రాతూరు, గుండిమెడ శివారు ప్రాంతాల్లో ఎక్కువ మంది రైతులు లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తుంటారు. ఆకు కూరలు సాగుచేసే రైతులు ఒక్కొక్క ఎకరం రూ.లక్ష చొప్పున కౌలుకు తీసుకున్నారు. ఒక ఎకరంలో పలు రకాల ఆకు కూరల మడులు వేయడానికి దుక్కి దున్నడం, మడులు ఏర్పాటు చేయడం, కట్టలు వేయడం, విత్తనాల కొనుగోలుకు మరో రూ.50 వేలు ఖర్చు అవుతుంది.

## ఎరువుల కల్చర్‌పై రైతులకు అవగాహన

గుంటూరు రూరల్: గుంటూరు ఏరువాక కేంద్రం, బాపట్ల వ్యవసాయ కళాశాల రావెప్ విద్యార్థుల సంయుక్తంగా రైతులకు క్షేత్ర స్థాయిలో కల్చర్ తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. మండలంలోని జొన్నలగడ్డలో పశువుల ఎరువుతో ట్రైకోడెర్మ విరిడి కలిపి కల్చర్ తయారీ విధానాన్ని చూపించారు. రావెప్ విద్యార్థినులు పశువుల ఎరువుతో ట్రైకోడెర్మ విరిడి కలిపి కల్చర్ తయారీ చేసి, పొలంలో చల్లటం వలన పంటలలో వచ్చే అనేక తెగుళ్లను నివారించవచ్చని సూచించారు. రైతులు కేవలం రసాయన ఎరువుల మీద మాత్రమే ఆధారపడటం వలన భూసారం తగ్గటమే కాకుండా భూమిలో ఉన్న అనేక లాభాదాయకమైన సూక్ష్మ జీవులు నశిస్తున్నాయని వివరించారు. ఈ పశువుల ఎరువుల కల్చర్ వినియోగించటం వలన భూసారం పెరగటంతో పాటు సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. దీని ద్వారా పంట ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ అభ్యుదయ రైతు వంగా నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.



కల్చర్ తయారీ చేసి రైతులకు చూపుతున్న రావెప్ విద్యార్థినులు

## పక్షవాతంపై అవగాహన పెంచుకోండి

- ఐఎస్ఏ అధ్యక్షురాలు డాక్టర్ విజయ
- పదిరోజులపాటు ఉచితంగా వైద్య పరీక్షలు

గుంటూరు మెడికల్: పక్షవాతం ప్రతి నలుగురిలో ఒకరికి వస్తుందని, వయస్సుతో సంబంధం లేకుండా ఎవరికైనా పక్షవాతం వస్తున్న దృష్ట్యా ప్రతి ఒక్కరూ వ్యాధిపై అవగాహన కలిగి ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్(ఐఎస్ఏ) జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ పమిడిముక్కల విజయ అన్నారు. అక్టోబరు పక్షవాత అవగాహన మాసం సందర్భంగా అక్టోబరు 19 నుంచి 29వ తేదీ వరకు వైద్య పరీక్షలు చేసేందుకు ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్, అంకినీడు స్ట్రోక్ సెంటర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, రోటరీ క్లబ్, పి.కుటుంబరావు ఎడ్యుకేషనల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో బ్రెయిన్ క్యాంప్ ఆన్ వీల్స్ అనే కార్యక్రమం ద్వారా అంబులెన్సును ఉచిత వైద్య పరీక్షలు చేసేందుకు ఏర్పాటు చేశారు. ఆదివారం గుంటూరు కొత్తపేటలో అంబులెన్సును డాక్టర్ విజయ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పి.ఆర్.రాజు, లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ పి.వి.రాఘవశర్మ, హాస్పటల్ డీన్ డాక్టర్ శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా డాక్టర్ విజయ మాట్లాడుతూ ప్రస్తుతం 50 సంవత్సరాల్లోపు వారు 25 శాతం మంది పక్షవాతం బారిన పడుతున్నారని చెప్పారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని 30 సంవత్సరాలు దాటిన వారందరూ ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. బీఫాస్ట్ నినాదం ద్వారా పక్షవాత లక్షణాలు గుర్తించి నాలుగున్నర గంటల్లోపు గోల్డెన్ అవర్‌లో చికిత్స అందిస్తే పక్షవాతం నుంచి సాధారణ స్థితికి తీసుకు రావచ్చన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ రాజు మాట్లాడుతూ ప్రజా ఆరోగ్య కార్యక్రమాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని, పక్షవాతంపై అవగాహన కోసం తాము మద్దతు అందిస్తున్నామన్నారు. సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.వి.రాఘవ శర్మ మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. లలిత హాస్పిటల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో హాస్పటల్ సిబ్బంది, లలితా నర్సింగ్ కాలేజీసిబ్బంది, విద్యార్థులకు డాక్టర్ విజయ పక్షవాతంపై అవగాహన కల్పించి పక్షవాతం రాకుండా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.



జెండా ఊపి అంబులెన్సు ప్రారంభిస్తున్న డాక్టర్ పదిమిముక్కల విజయ, డాక్టర్ రాఘవశర్మ

## అందుబాటులోకి పురమిత్ర యాప్

నెహ్రూ నగర్: రాష్ట్ర వ్యాప్తంగా నగర ప్రజలకు పురపాలక సేవలను సులభతరం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పురమిత్ర యాప్‌ని అందుబాటులోకి తెచ్చిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా ప్లే స్టోర్‌లో డౌన్ లోడ్ చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పురమిత్ర యాప్ ద్వారా ప్రజలు మున్సిపల్ సేవలు, ఫిర్యాదు లు, పన్ను చెల్లింపులు, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు వంటి దాదాపు 122 పురపాలక సేవలు పొందవచ్చన్నారు. సమస్యలను ఫిర్యాదుతో పాటు ఫోటోలను కూడా అప్‌లోడ్ చేయవచ్చన్నారు. వీధి దీపాలు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అంశాలపై ఫిర్యాదులు, సేవల కోసం దరఖాస్తు, వాటి పరిష్కార స్థితిని తెలుసుకోవానికి ట్రాకింగ్ కూడా ఉంటుందని వివరించారు. ఫిర్యాదులు, సేవల పరిష్కారానికి నిర్దేశిత గడువు ఉంటుందని చెప్పారు. ఆస్తి పన్ను, నీటి చార్జీలు, డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, డ్రెయినేజీ చార్జీలు, ఆస్తి పన్ను మ్యూటేషన్ ఫీజు, షాప్ లీజులు, అగ్రిమెంట్ ఫీజులు, అడ్వర్టైజ్మెంట్ ట్యాక్స్‌లను యాప్ ద్వారా ఇంటి వద్ద నుండే చెల్లించే అవకాశం ఉందని తెలిపారు. వచ్చే వారం నుంచి వార్డు సచివాలయాల వారీగా ప్రజలకు యాప్ డౌన్‌లోడ్, వినియోగంపై అవగాహన కలిగించనున్నట్లు చెప్పారు.

## ఒక డీఏ విడుదలపై హర్షం

గుంటూరు మెడికల్: ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఒక డీఏ విడుదల చేయడం పట్ల ఏపీ ఎన్జీఓ సంఘం గుంటూరు జిల్లా ఏపీ ఎన్జీజీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఘంటసాల శ్రీనివాసరావు, ఆలపాటి నరసింహ సుందర్ శ్రీవాణి పేర్కొన్నారు. ఆదివారం గుంటూరులోని సంఘ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, జిల్లా ఉపాధ్యక్షుడు సూరేపల్లి రాజశేఖర్, జిల్లా సంయుక్త కార్యదర్శులు కృష్ణ కిషోర్, కూరపాటి శ్రీనివాసరావు, సయ్యద్ జానీబాషా, విజయ్, కార్యనిర్వాహక కార్యదర్శి సుకుమార్, నగర అధ్యక్ష, కార్యదర్శులు సూరి, కళ్యాణ్ కుమార్, మహిళా విభాగం నాయకురాలు శ్రీవాణి, విజయలక్ష్మి ఉన్నారు.

## ఉచిత వైద్య శిబిరం




గుంటూరు మెడికల్: విద్యార్థులు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని ప్రముఖ ఐవీఎఫ్ స్పెషలిస్టు డాక్టర్ శనక్కాయల రాజకుమారి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక నాజ్ సెంటర్‌లో ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలో అహల్య ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి డాక్టర్ శనక్కాయల అరుణ, డాక్టర్ శనక్కాయల రాజకుమారి పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాలలోని విద్యార్థులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జోత్స్న కుమారి, వార్డెన్ అనూషా, దాత్రి కుమారి, శుభరత్నం, లత, అనూషా పాల్గొన్నారు.

## అవోపా ఆధ్వర్యంలో పేదలకు పింఛన్లు పంపిణీ



గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) ఆధ్వర్యంలో ఆదివారం పేద వృద్ధులకు 38వ నెలవారీ పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అవోపా గుంటూరు శాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీసాయి ప్రగతి ఇన్‌ఫ్రా డెవలపర్స్ డైరెక్టర్ తెడ్ల గురుప్రసాద్ ఈ నెల పెన్షన్ మొత్తాన్ని విరాళంగా అందజేసి, అవోపా సేవలను కొనియాడారు. క్యాపిటల్ కో-ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్లు ఇ.పాండురంగ సురేష్, సీహెచ్ నాగేంద్రకుమార్ మాట్లాడుతూ అవోపా సేవా కార్యక్రమాలకు తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అవోపా గుంటూరు శాఖ కార్యదర్శి వెచ్చా రాధాకృష్ణయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాచపూడి సుబ్బారావు పాల్గొన్నారు.

## కారుపై కూలిన చెట్టు



నెహ్రూనగర్: బృందావన్‌గార్డెన్స్ మెయిన్ రోడ్డులో ఆదివారం సాయంత్రం భారీ చెట్టు కూలింది. ఆసమయంలో కారు అక్కడ ఉండటంతో కారుపై పడడంతో కారు ముందు భాగం ధ్వంసమైంది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఒక్కసారిగా చెట్టు కూలడంతో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగలేదు.

## అమెరికా వేస్తున్న సుంకాలకు వ్యతిరేకంగా నిరసన

మంగళగిరి టౌన్: భారత్‌పై అమెరికా వేస్తున్న సుంకాలకు వ్యతిరేకంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, ఏపీ కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో మంగళగిరి మండల పరిధిలోని ఆత్మకూరులో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చిత్రపటాన్ని దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అమెరికా నుంచి భారత దేశానికి పన్నులు లేకుండా డెయిరీ ఉత్పత్తులను, వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవాలని ట్రంప్ భారత ప్రభుత్వంపై వత్తిడి తెస్తున్నారన్నారు. ఇది అమలు జరిగితే వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో పడుతుందని, రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుందన్నారు. వీసాల పునరుద్ధరణకు అనుమతి వస్తుందో లేదో అన్న భయంతో ఇండియాకు వచ్చే వారిని వెళ్లిపోమ్మని రూల్స్‌లో మార్పులు తెస్తున్నారన్నారు. ట్రంప్ అంక్షలతో ఎప్పుడు ఉద్యోగం పోతుందో తెలియని పరిస్థితుల్లో భారతీయులు ఉన్నారని పేర్కొన్నారు. అమెరికా వేస్తున్న సుంకాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, దీనిపై భారత ప్రభుత్వం ట్రంప్‌ను ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం మంగళగిరి మండల అధ్యక్షుడు ఆజంకుమార్, సీఐటీయూ మండల కార్యదర్శి దుర్గారావు, చేనేత కార్మిక సంఘం నాయకులు శీతారామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.